

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### 1

**"రేపొద్దున ఎన్నింటికి లేపను?"** రాత్రి పడుకోబోయేముందు అడిగింది మృదుల

"ఎందుకు? రేపు ఆదివారమేగా?" శ్రీనాధ్ ప్రశ్నించాడు.

ఎందుకో తెలిసికూడా తెలియనట్లు అడగడంతో మృదుల కోపం వచ్చినా నిగ్రహించుకుని చెప్పింది.

"రేపు మున్నీ ఎంగేజ్ మెంట్ కదా? పదింటికల్లా రమ్మని అన్నయ్య చెప్పాడుగా? ఇందాక ఫోన్ కూడా చేసాడు. మీతో కూడా మాట్లాడాడటగా?"

"వాళ్ళకేం వాళ్ళు చెప్తారు. వారమంతా గొడ్డులాగ కష్టపడ్డాక వచ్చే ఆదివారం కూడా రెస్ట్ లేకుండా వెధవ ఫంక్షన్లు. ఏ అస్సాంలోనో ఉద్యోగమైతే బావుండేది. నీకు ముందే చెపుతున్నాను. నేను నా అంతట నేను లేచేదాకా లేపద్దు. ఇన్‌డైరెక్ట్‌గా గిన్నెల చప్పుడు, టి.వి చప్పుడు వినిపించినా ఊరుకోను జాగ్రత్త." శ్రీనాధ్ చిరాగ్గా చెప్పి అటు తిరిగిపడుకున్నాడు.

ఉక్రోషంతో కన్నీళ్ళు వచ్చాయి మృదులకి. స్టేట్ గవర్నమెంట్‌లో ఆఫీసరైన శ్రీనాధ్‌కి కొంచెం అహం, ఇంకొంచెం అత్తగారంటే చులకన. అతని స్వభావం తెలిసిన మృదుల ఊర్లోనే పుట్టిల్లు ఉన్నా అవసరం లేనిదే వెళ్ళదు. కానీ అన్నయ్య, వదిన వచ్చు 'పిల్ల పెళ్ళి కుదిరింది, ఫలానా రోజు ఎంగేజ్ మెంట్, పొద్దున్నే వచ్చెయ్యండి అని చెప్తే సరే అని తలూపాడు శ్రీనాధ్ ఇప్పుడీమాట. ఏమీ చెయ్యలేని నిస్సహాయతతో మృదులకి చాలాసేపు నిద్రపట్టలేదు.

పొద్దున్నే నిద్రలేచి శ్రీనాధ్ లేచే టైంకి రెడీ అయితే సమయం కలిసొస్తుందని చకచకా రెడీ అయి పట్టుచీర కట్టుకుని సిద్ధంగా ఉంది మృదుల. ఎనిమిదిన్నరకి లేచాడు శ్రీనాధ్. మృదుల ఇచ్చిన కాఫీ తాగుతూ గంటసేపు పేపర్, ఆదివారం అనుబంధంతో సరే అక్షరం అక్షరం చదివాడు. తర్వాత బద్ధకంగా లేచాడు. మనసులో ఎంత కోపంగా ఉన్నా బయటికి కనపడనీకుండా మృదుల అతను స్నానం చేసి వచ్చేసరికి బట్టలు రెడీగా పెట్టి, తాళం చెవులు పట్టుకుని నిలబడింది.

"టిఫినా?" తెల్ల మొహం లేసింది మృదుల.

"బ్రేక్ ఫాస్ట్ కూడా అక్కడేనని చెప్పాడుగా అన్నయ్య?"

"చెప్తాడు. కానీ ఏం పెడతాడో నాకు తెలుసు. చల్లారిపోయిన గోధుమ రవ్వ ఉప్మా, ఉప్పూ కారం లేకుండా చేసి పెడతాడు. వారానికొక్కసారి వచ్చే ఆదివారం నాకు పూరీ తినాలని ఉంది. బంగాళా దుంపలకూర చెయ్యి. తిన్నాక బయలుదేరదాం. కొంపలేం మునిగిపోవు" చెప్పి, పత్రికలో పజిల్ పూర్తి చేయడానికి పెన్ను తీసుకుని కూర్చున్నాడు శ్రీనాథ్.

"పూరీ రేపు చేసి పెడతాను. పట్టుచీరకట్టుకున్నాను. నూనె మరకలైతే కష్టం. విప్పితే మడతలు కుదరవు. ఇస్త్రీ పోతుంది. ప్లీజ్ పోనీ ఇడ్లీ వేయనా?"

అసహనాన్ని అణుచుకుంటూ అడిగింది.

"వద్దు. నిన్నా అదే తిన్నాగా?"

"పోనీ దోసె?"

"సరే" ఏ కళనున్నాడో ఒప్పుకున్నాడు.

పాత లుంగీని ఏ ప్రాన్‌లా కట్టుకుని దోసెలు వేసేస్తే తాపీగా టీవీలో వార్తలు చూస్తూ అరగంట సేపు తిన్నాడు శ్రీనాథ్.

"అరకప్పు కాఫీ ఇస్తావా? బాగా వేడిగా ఉండాలి. ఇందాక నువ్విచ్చిన కాఫీ చల్లగా ఉంది" ఛానల్స్ మారుస్తూ అడిగాడు.

"నేను వేడిగానే ఇచ్చాను. మీరు పేపర్ చదివినంత సేపు వేడిగా ఎలా ఉంటుంది?" ప్రశాంతంగా చెప్పి కాఫీ కలుపుకొచ్చింది.

ఈసారి కొంచెం వేగంగా ఓ పావుగంట సేపు తాగి తప్పదన్నట్లుగా కారు తాళాలు తీసుకుని బయలుదేరాడు శ్రీనాథ్.

దారిపొడుగునా ఆదివారం ఫంక్షన్ పెట్టిన బావమరిదిని, సాయంత్రం కాకుండా ఉదయం ముహూర్తం పెట్టిన బ్రాహ్మడ్ని, పూరీ వండి పెట్టని భార్యని, ట్రాఫిక్‌ని తిడుతూనే ఉన్నాడు శ్రీనాథ్. బిక్కచచ్చి పోయి మౌనంగా కూర్చుండి పోయింది మృదుల. తిక్కమనిషి ఏమైనా అంటే కారుని వెనక్కి తిప్పుతాడని తెలుసు.

ఎంగేజ్ మెంట్ జరిగే హోటల్ రాగానే అప్పటికే వచ్చిన బంధువులందరూ కోలాహలంగా కబుర్లు చెప్పుకుంటున్నారు. వీళ్ళని చూడగానే గబగబ దగ్గరకి వచ్చిన మృదుల అన్నయ్య బావగారికి షేక్ హాండ్ ఇచ్చి, చెల్లెలితో చెప్పాడు.

"సొంత మేనత్తివి. ఇప్పుడా రావడం? అందరూ నిన్నడగడమే. పద. పద. అమ్మ, వదిన ఆ గదిలో ఉన్నారు"

తర్వాత శ్రీనాథ్‌తో చెప్పాడు.

"బ్రేక్ ఫాస్ట్ చేద్దాం రండి బావా, పూరీ, ఇడ్లీ వడ ఉన్నాయి. మీకేది కావాలంటే అది తినండి."

"నేను ఇంటిదగ్గర తినేసే వచ్చా. నాకేం వద్దు." ముభావంగా చెప్పి ఓ కుర్చీలో కూర్చున్నాడు శ్రీనాథ్.

అతని స్వభావం తెలుసు కాబట్టి మృదుల అన్నయ్య మరేం మాట్లాడలేదు.

చుట్టాలందరూ మృదులతో నిష్ఠూరంగా మాట్లాడారు. 'ఊళ్ళోనే ఉండి ఇంత ఆలస్యంగా వచ్చావు. మీ ఆయన ఆఫీసర్ అయితే నీకెందుకు ఇంత పొగరు, పుట్టింటి  వాళ్ళు నీ మేలుకోరేవాళ్ళు, వాళ్ళని నిర్లక్ష్యం చేయకూడదు..'

మృదుల ఎవరికీ సమాధానం చెప్పలేదు. శ్రీనాథ్ స్వభావం తెలిసిన మృదుల తల్లీ, వదిన కూడా ఏమీ మాట్లాడలేదు.

ఎంగేజ్ మెంట్ కార్యక్రమంలో మృదుల చురుగ్గా పాల్గొంది. వదినకి సహాయం చేస్తూ, పెళ్ళి కూతుర్ని ఆటపట్టిస్తూ ఉత్సాహంగా ఉన్న మృదులని ఆశ్చర్యంగా చూసాడు శ్రీనాథ్. ఇంట్లో ఆమె ఎప్పుడూ నెమ్మదిగా ఉంటుంది. కానీ ఇక్కడ అంతటా తనే అన్నంత సందడిగ ఉంది.

పెళ్ళి తిరుపతిలో చేయాలని మొక్కు ఉందని పెళ్ళికొడుకు తరపువారు చెప్పారు. ఆ మాట విని ఆనందించింది మృదుల. ఊళ్ళో పెళ్ళయితే శ్రీనాథ్ ముహూర్తాలుతప్పిస్తాడు. అప్పగింతల టైకి తీసుకెళ్ళడం కూడా అనుమానమే. తిరుపతి అయితే ముందు రోజే హాయిగా పెళ్ళివారితో వెళ్ళిపోవచ్చు.

స్టేట్ గవర్నమెంట్ ఆఫీసర్‌గా కీలక పోస్ట్‌లో ఉన్న శ్రీనాథ్ అత్తగారివైపు వాళ్ళ కోసం రెండు రోజుల శలవుని వృధా చేసుకోడు. మంచివాడు అనిపించుకోవాలి కాబట్టి తనని పంపక తప్పదు. అతని సమక్షంలో ఎలాగైనా తనకి స్వేచ్ఛగా ఉండదు. తిరుపతిలో ఒక్కతే హాయిగా పెళ్ళి చూసిరావచ్చు అనుకుంది.

మగపెళ్ళివాళ్ళతోనే భోజనం చేసేసాడు శ్రీనాథ్ మృదులని పక్కకి పిలిచి చెప్పాడు.

"నువ్వు కూడా త్వరగా తినెయ్. ఇంటికి వెళదాం"

"అప్పుడేనా?" తెల్లమొహం వేసింది మృదుల.

"మరి ఇంకెప్పుడు? ఈ హోటల్ వాడు మెడపట్టుకుని గెంటేదాకా కదలరా? నాకు నిద్రొస్తుంది. నీకు తెలుసుకదా నాకు మధ్యాహ్నం నిద్ర లగ్జరీ. నీకోసం ఒక్క ఇరవై నిమిషాలు వెయిట్ చేస్తాను అంతే. నువ్వొచ్చినా రాకపోయినా వెళ్ళిపోతా నీ ఇష్టం"

కటువుగా చెప్పాడు.

ఇక రెట్టించకుండా మృదుల గబగబా భోజనం చేసి వదినకి, తల్లికి చెప్పి బయలుదేరింది. శ్రీనాథ్‌కి ఎదురు చెప్పడం ఖాయం కాబట్టి వారు అయిష్టంగానే వాళ్ళకి వీడ్కోలు చెప్పారు.

మళ్ళీ దారి పొడుగునా శ్రీనాథ్, బావమరిదిని, భోజనాన్ని సంస్కారం లేని చుట్టాలని తిడుతూనే ఉన్నాడు. మృదుల మౌనంగా కిటికీలోంచి చూస్తూ కూర్చుంది. ఇంటికి వచ్చాక శ్రీనాథ్ పడుకున్నాడు. డ్రాయింగ్ రూములో కూర్చున్న మృదుల కళ్ళనిండా నీరు. ఒక్క గంట సేపుంటే పెళ్ళివాళ్ళతో బయలుదేరేవాళ్ళు. సొంత చెల్లెలై ఉండి చుట్టంలాగా లేట్‌గా వెళ్ళి ముందే రావాల్సి వచ్చింది. ఆడవాళ్ళకి ఈర్ష్యాసూయలు ఉంటాయి. తను తన వాళ్ళతో ఆనందంగ గడపడం అతనికి ఇష్టంలేదు. సంఘంలో బ్రతుకుతున్నారు కాబట్టి పూర్తిగా వాళ్ళని వదిలేయలేడు. ఆఫీసర్ శ్రీనాథ్ భార్యగా కాక, తన అన్నయ్యకి చెల్లెలిగా తన ఉనికిని అతను భరించలేడు. ఆ ఇన్‌సెక్యూరిటీతోనే అత్తగారి తరపు వాళ్ళని విమర్శించడం, చులకనగా చూడడం చేస్తుంటాడు. అతను మారతాడని కూడా ఆమెకి నమ్మకం లేదు.

చెప్పినట్లుగా మర్నాడు పూరీ, బంగాళా దుంపకూర వండింది మృదుల.

"బ్రేక్ ఫాస్ట్‌గా డీప్ ఫ్రైస్ చేయకు మృదులా. పొద్దున్నే నూనె వికారంగా ఉంటుంది" విసుక్కున్నాడు శ్రీనాథ్.

"మీరు నిన్న పూరీ కావాలన్నారుగా? "

"నిన్న తినాలి అనిపించి అడిగాను. నేనడిగినప్పుడు చెయ్యాలి కానీ నీకు కుదిరినప్పుడు కాదు."

"కాఫీ ఇవ్వనా?"

"వద్దు. టైమైపోతోంది. బై." వెళ్ళిపోయాడు.

***

"రేపు పొద్దున్నే లేపు. ఆరు తర్వాత ఎప్పుడైనా పర్లేదు." ఆ రోజు రాత్రి పడుకోబోయే ముందు చెప్పాడు శ్రీనాథ్.

"రేపు ఆదివారమేగా? ఎందుకు?" అడిగింది మృదుల.

"రేపు మా పెద్దక్కయ్య మనవడి బారసాల. పొద్దున్నే వచ్చేయమంది."

"అవునా నాకు చెప్పనే లేదు?"

"నాకు ఆఫీస్‌కి ఫోన్ చేసింది నీకు చెప్పమంది కానీ మర్చిపోయా."

"ఇంటికి ఫోన్ చేసింది నీకు చెప్పమంది కానీ మర్చిపోయా."

"ఇంటికి ఫోన్ చేసి నాక్కూడా చెపితే బావుండేది" మెల్లగా చెప్పింది మృదుల.

"ఏం నాకు చెపితే నీకు చెప్పినట్లు కాదా?" అరిచాడు శ్రీనాథ్.

"ఏ టైంకి బయలుదేరాలి?"

"ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా, మా వాళ్ళందరూ వస్తారు. కాసేపు కబుర్లు చెప్పుకున్నట్లుంటుంది"

"బ్రేక్ ఫాస్ట్ ఏం చేయను?"

"అవేం పెట్టుకోకు లేటవుతుంది. కాఫీ చాలు."

"సరే" అటు తిరిగి పడుకుంది మృదుల.

"అన్నట్లు చెప్పడం మర్చిపోయాను. రేపు సాయంత్రం ఉయ్యాల్లో వేసే ఫంక్షన్ కూడా ఉందిట. నిన్ను ఇంకో చీర కూడా తెచ్చుకోమని చెప్పింది మా అక్కయ్య. పేరంటం చేస్తారుట. ఏకంగా రాత్రి భోజనం చేసి వెళ్ళమంది. "

చెప్పాడు శ్రీనాథ్.

"మరి మీకు ఆదివారం మధ్యాహ్నం నిద్ర లగ్గరీగా?" ఉక్రోషాన్ని అదిమిపెట్టుకుంటూ అడిగింది మృదుల.

"పర్లేదు. వచ్చే ఆదివారం పడుకుంటా. నువ్వు మాత్రం రేపు ఏడింటికల్లా రెడీ అయి నన్ను లేపు. మర్చిపోకు."

మృదులకి ఎందుకో తెరలు తెరలుగా నవ్వొచ్చింది. దాన్ని బలవంతంగా ఆపేసినా ఆమె పెదవులపై ఆ నవ్వు చిరునవ్వుగా తళుక్కుమంది.

*( వచ్చేసంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story